# అభ్యర్థి ఎన్నికల ఖర్చు @ రూ.40 లక్షలు




మాట్లాడుతున్న డీసీవో రామానుజాచారి

- వ్యయ పరిశీలనలో లెక్కింపు బృందాలే కీలకం
- జిల్లా సహకార అధికారి రామానుజాచారి

కలెక్టరేట్, అక్టోబర్ 17: శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే ఒక్కో అభ్యర్థి ఖర్చు రూ.40 లక్షలకు మాత్రమే అనుమతి ఉండగా, వారి ఖర్చుల వివరాలు వ్యయ పరిశీలకులు కూలంకషంగా పరిశీలించాలని జిల్లా సహకార అధికారి రామానుజాచారి తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో మంగళవారం ఎన్నికల వ్యయ పరిశీలనలో పాల్గొనే అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ పర్యవేక్షకులు, అకౌంటింగ్, ఆడిట్ బృందాల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు సంబంధిత సిబ్బంది మెలకువలు, విధానాలు తెలుసుకొని ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయించిన మేరకు వ్యయ పరిశీలన పకడ్బందీగా జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆడిట్ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి పద్మావతి, నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ రాంబాబు, డీఈవో జనార్దన్‌రావు, కో ఆపరేటివ్ అధికారి మనోజ్‌కుమార్, పరిశ్రమల శాఖ అధికారి నవీన్ పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

## యాసంగి ప్రణాళికపై అవగాహన

కొత్తపల్లి, అక్టోబర్ 17: ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ఆధ్వర్యంలో మంగళవారం నాగులమల్యాలలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు యాసంగి సాగు ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డా. మంజులత మాట్లాడుతూ, రైతులు ఆరుతడి పంటలు వేయాలని, పంట మార్పిడి, జీరో టిల్లేజ్ మక్కజొన్న సాగు గురించి వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త డా. విజయభాస్కర్ మాట్లాడుతూ, ఆరుతడి పంటల్లో చీడపీడల నివారణ చర్యల గురించి సూచించారు. అనంతరం రైతులు వేసిన పత్తి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త మదన్‌మోహన్‌రెడ్డి, దత్తత గ్రామ ఇన్‌చార్జి డా. ఉషారాణి, కోరమండల్ కంపెనీ సిబ్బంది, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు అల్ఫోర్స్ విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 17 : ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొనేందుకు నవంబర్ ఒకటి నుంచి 10 వరకు విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీ (మంగళగిరి)లో జరిగే ప్రీ రిపబ్లిక్ పరేడ్ శిక్షణ శిబిరానికి అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీరు పంజాల మేఘన ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థినికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీ విజయలక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎస్ ఐలయ్య, ఎస్ రజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 17: తెలంగాణ ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలు రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. కరీంనగర్‌లోని ఒక కేంద్రంలో 136 మంది విద్యార్థులకు గానూ 118 మంది హాజరయ్యారు. అలాగే, ఇంటర్ రెండు పరీక్షా కేంద్రాల్లో 73 మంది విద్యార్థులకు గానూ 59 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలో ఒక కేంద్రంలో పదో తరగతి పరీక్షకు 24 మంది విద్యార్థులకు 20 మంది హాజరయ్యారు. ఇంటర్ రెండు కేంద్రాల్లో 68 మంది విద్యార్థులకు గానూ 56 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, డీఈవో జనార్దన్ రావు తనిఖీ చేసినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ నాగేశ్వర్ రావు పేర్కొన్నారు.

## మైసూరు దసరా ఉత్సవాల్లో జిల్లా కళాకారులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 17: భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు ఆహ్వానం మేరకు కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో రాష్ట్రం నుంచి 15 మంది యువ కళాకారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా తెలంగాణ జాతీయ యువజన అవార్డు గ్రహీత రేండ్ల కళింగ శేఖర్ నేతృత్వంలో యువ కళాకారులు జగిత్యాల జిల్లా రాయికల్ మండలానికి చెందిన భూక్యా గంగాధర్ నాయక్ బంజారా నృత్యం, తెలంగాణ బతుకమ్మ, బోనాల ప్రదర్శన ఇచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి మాస్టర్ చక్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన డోలక్ రాజు, డప్పు మహేశ్, డప్పు అజయ్, తదితర కళాకారులు హాజరై ప్రదర్శనలు ఇచ్చారు.

## రేపు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కొత్తపల్లి, అక్టోబర్ 17: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 19న జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి పేర్కొన్నారు. అండర్–14, 16, 18 ఏళ్లలోపు బాలబాలికలకు, 20 ఏళ్లలోపు పురుషులకు, మహిళలకు 100, 200, 400, 600, 800, 1500, 3000, 5000, 10000 మీటర్ల పరుగు, షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన 30 మంది క్రీడాకారులను ఈనెల 25, 26వ తేదీల్లో సూర్యపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు.

## అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 17: 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మహేశ్వర్ తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని ప్రతిమ వైద్య కళాశాలలో మంగళవారం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకొని విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ వైద్య కళాశాల డీన్ వివేకానంద, తహసీల్దార్ అనిల్, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

## కార్యవర్గం

విద్యానగర్, అక్టోబర్ 17 : అనస్థిషీయ వైద్యుల కార్యవర్గాన్ని మంగళవారం కరీంనగర్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ వినయ్, డాక్టర్ గంగాధర్, కోశాధికారిగా డాక్టర్ ఓం ప్రకాశ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రత్నాకర్, సీనియర్ వైద్యులు ఆసీమ్, నరేశ్, తదితరులు అభినందనలు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

## పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణచౌక్, అక్టోబర్ 17: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ స్టేడియంలో వచ్చే నెల 4న నిర్వహించనున్న ప్రజా గర్జన మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్, కుల సంఘాల జేఏసీ చైర్మన్ జీఎస్ ఆనంద్, బషీర్ పటేల్, రమేశ్‌గౌడ్, మల్లయ్య, కలరేసత్తన్న పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు సత్కారం

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 17 : ఇటీవల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందిన పీఆర్టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెపాటి వేణుగోపాల్ రావు, రామడుగు మండలాధ్యక్షుడు మహ్మద్ అశ్వాక్ హుస్సేన్‌ను సంఘం జిల్లా సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పాతూరి రాజ్ రెడ్డి, కేతిరి తిరుపతిరెడ్డి, అట్ల శ్రీనివాస్ రెడ్డి, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు చొల్లేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులిపాక కిషన్, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు రాంరెడ్డి, శ్రీనివాస్, వినోద్, సంజీవరెడ్డి, రామకృష్ణ, ప్రశాంత్, దయాకర్ పాల్గొన్నారు.

## విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 17: నగరంలోని మెట్రో ఫంక్షన్ హాల్లో ఈనెల 22న ముస్లిం మహిళలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ముస్లిం ఆర్గనైజేషన్ జేఏసీ పట్టణ కమిటీ కన్వీనర్ అహ్మద్ అలీ తెలిపారు. నగరంలోని ప్రెస్‌భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశం కొనసాగుతుందన్నారు. ముస్లింలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కలెక్టరేట్, అక్టోబర్ 17: నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జడ్పీ ముఖ్యకార్యనిర్వహణాధికారి పవన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల జిల్లా ప్రాదేశిక సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు హాజరుకావాలని కోరారు.

## ఓటరుగా నమోదుకు 30 వరకు అవకాశం

కలెక్టరేట్, అక్టోబర్ 17: ఎన్నికల సంఘం సూచనల మేరకు ఈనెల 30వ తేదీ వరకు ఓటు హక్కు నమోదుకు తుది అవకాశం కల్పిస్తున్నట్లు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కొత్తగా నమోదు చేసుకునే వారంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు నేడే ఆఖరు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 17: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎం రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా (జగిత్యాల, పెద్దపల్లి) అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు బుధవారం స్టడీ సర్టిఫికెట్లతో నేరుగా లేదా స్టడీ సర్కిల్ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్ 0878–2268686లో సంప్రదించాలని పేర్కొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

కమాన్‌చౌరస్తా, అక్టోబరు 17: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో మంగళవారం చైతన్యపురి మహాశక్తి ఆలయంలో అమ్మవారు చంద్రఘంట రూపంలో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు చేశారు. కేబీ శర్మ బృందం భక్తి సంగీత విభావరి అలరించింది. యజ్ఞవరాహస్వామి క్షేత్రంలోని త్రికూటాలయంలో జరిగిన పూజల్లో సర్వవైదిక సంస్థానం ట్రస్టు ఉపకులపతి శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు. గోదాంగడ్డలో క్రాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించి అమ్మవారిని శాకాంబరీగా అలంకరించారు. సంతోష్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి సన్నిధిలో భక్తులు మహాచండీయాగం చేశారు.



మహా చండీయాగంలో పాల్గొన్న భక్తులు